సాక్షి ఒడిశా

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5,14,602
బంగారం: 7 గ్రాములు
వెండి: 27 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్‌/పూరీ



కాంగ్రెస్‌కు ప్రజాదరణ తగ్గలేదు

కాంగ్రెస్‌ పార్టీకి ప్రజాదరణ తగ్గలేదని ఒడిశా ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ (ఓపీసీసీ) కొత్త అధ్యక్షుడు భక్త చరణ్‌ దాస్‌ పేర్కొన్నారు. – 8లో



మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

రాయఘడ బ్లాక్‌ మహేంద్రగిరిలో జిల్లా కలెక్టర్‌ విజయ్‌ కుమార్‌ దాస్‌ శుక్రవారం పర్యటించారు. శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షించారు. – 8లో

న్యూస్‌రీల్‌

లారీ బోల్తా



ప్రమాదానికి గురైన లారీ

రాయగడ: టికిరి సమితి దొరాగుడలోని ఉత్కళ అల్యూమినా కర్మాగారం నుంచి అల్యూమినియం పౌడర్‌ లోడుతో వెళ్తున్న లారీ సిరిగుడ, తితపామునో బైపాస్‌ రోడ్డు మలుపులో అదుపుతప్పి బోల్తా పడింది. శుక్రవారం వేకువజామున జరిగిన ఈ ఘటనలో పౌడర్‌ బస్తాలన్నీ కిందపడిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో ఆరుగురు ఉండటంతో స్థానికులు స్పందించి వారిని బయటకు తీశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సదరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రిక్‌ విద్యార్థుల వాహనం బోల్తా

• 11 మందికి గాయాలు • పైక్లిస్టు మృతి



బోల్తా పడిన వాహనం

భువనేశ్వర్‌: పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులతో వెళ్తున్న వాహనం బోల్తా పడిన ఘటన తొలిరోజునే మెల్కన్‌ పోలీసు బాణా పరిధిలోని కృష్ణనగర్‌ కూడలి సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్‌యూవీ వాహనం సైక్లిస్టును ఢీకొట్టిన ఈ ఘటనలో 11 మంది విద్యార్థులు గాయపడగా సైక్లిస్ట్‌ సుభాష్‌ మండల్‌ అక్కడికక్కడే మరణించాడు. క్షతగాత్రులను చికిత్స కోసం తొలుత ఆస్పత్రిలో చేర్చారు. బమ్ముకరి వికెకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు బోర్డు పరీక్షలు రాసేందుకు కొమెరా సాహిలోని నాగ నారాయణ్‌ ఉన్నత పాఠశాల మెట్రిక్‌ పరీక్ష కేంద్రానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సైకిల్‌ నడుపుతున్న వ్యక్తిని ఢీకొట్టిన తర్వాత వాహనం రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటన జరిగిన సమయంలో ఉద్రిక్త నెలకొంది. ఎస్‌యూవీ డ్రైవర్‌ను అరెస్టు చేస్తున్న సమయంలో స్థానికులు పోలీసులను అడ్డుకున్నారు. ఊహించని ఘటన కారణంగా అలస్యంగా వచ్చినప్పటికీ గాయపడిన కొంతమంది విద్యార్థులను పరీక్షకు హాజరు కావడానికి అనుమతించారు.


నదిలో మునిగి యువకుడు మృతి



సరోజ్‌ సాహు మృతదేహం

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌ కుంద్ర సమితి జిరాగుడ గ్రామ సమీప కొలాబ్‌ నదిలో యువకుని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కుంద్ర సమితి బెడాపుట్ట గ్రామం సరోజ్‌ సాహు (35)గా గుర్తించారు. శుక్రవారం స్నానం కోసం వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు కుంద్ర అగ్ని మాపక విభాగ అధికారులకు తెలియజేయడంతో సిబ్బంది వచ్చి రెండు గంటలు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. కుంద్ర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కుంద్ర పోలీసు అధికారి చిత్తరంజన్‌ ప్రధాన్‌ వెల్లడించారు. గాలింపు చర్యల్లో స్టేషన్‌ అధికారి సరోజ్‌ కుమార్‌ భతియ, గౌరవ నాయక్‌, రామకృష్ణ గౌడ, హీరాధర భొత్ర, ఆయ హరిజన్‌, శ్రీకాంత శెట్టి ఉన్నారు.

కుప్పకూలిన వేదిక



కూలిన రంగస్థలం వేదిక

భువనేశ్వర్‌: కేంద్రాపడా జిల్లా రాజ్‌నగర్‌ ప్రాంతంలో శుక్రవారం అకాల వర్షం కురిసింది. రాజ్‌నగర్‌ మండలం డంగమాల్‌ ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షంతో మనోరంజక కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన వేదిక కూలిపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

మేమున్నామని..!

ఎప్పుడు ఎలాంటి సాయం కావాల్సి వచ్చినా అండగా ఉంటామని బీఎస్‌ఎఫ్‌ జవాన్లు ఆదివాసీలకు భరోసా ఇచ్చారు. మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కర్తాన్‌పల్లి పంచాయతీలో శుక్రవారం బీఎస్‌ఎఫ్‌–2 బెటాలియన్‌ కమాండెంట్‌ వరునేంద్ర ప్రతాప్‌సింగ్‌ నేతృత్వంలో జనసంపర్క శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులు వితరణ చేశారు. వృద్ధులకు రగ్గులు, మహిళలకు చీరలు, విద్యార్థులకు బ్యాగులు, దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేయడంతో గ్రామస్తుల్లో ఆనందం వెల్లివిరిసింది. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కర్తాన్‌పల్లి బీఎస్‌ఎఫ్‌ క్యాంప్‌ కమాండర్‌ జగ్గీవన్‌, జవాన్లు, మత్తిలి ఆరోగ్య కేంద్రం వైద్యులు, కోప్ర, దల్లిలి, బులేను గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. – మల్కన్‌గిరి



యువతకు సామగ్రి అందజేస్తున్న బీఎస్‌ఎఫ్‌ జవాన్లు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం



విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేస్తున్న కమాండర్‌ వరునేంద్ర ప్రతాప్‌సింగ్‌



దివ్యాంగుడికి వీల్‌చైర్‌ అందిస్తున్న అధికారి



వృద్ధులకు రగ్గులు అందజేస్తున్న అధికారులు

విద్యార్థి మరణంపై సభలో రచ్చ



శాసన సభలో బడ్జెట్‌ సమావేశాలు

భువనేశ్వర్‌: స్థానిక కళింగ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇండస్ట్రియల్‌ టెక్నాలజీ (కిట్‌) విశ్వవిద్యాలయ విద్యార్థిని అకాల మరణంపై శాసనసభ సమావేశాల్లో రచ్చ రేగింది. అంతర్జాతీయ విద్యార్థుల భద్రత, శ్రేయస్సుపై నమ్మకం లోపించి ఆందోళనలు రేకెత్తించింది. కిట్‌ విశ్వవిద్యాలయంలో చదువుతున్న నేపాల్‌కు చెందిన విద్యార్థుల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు ఘటన బోటు చేసుకుందని ఆరోపణలపై కొనసాగుతున్న నిరసనల మధ్య శుక్రవారం శాసన సభలో ప్రతిపక్ష కాంగ్రెసు తీవ్రంగా విరుచుకు పడింది. నేపాలీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న తర్వాత కిట్‌ విశ్వవిద్యాలయంలో అశాంతి చెలరేగింది. ఈ పరిస్థితిపై సభలో చర్చ జరగాలని కాంగ్రెస్‌ వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించింది. ఈ అభ్యర్థన మేరకు సభాపతి చర్చకు అనుమతించారు. రాష్ట్ర శాసన సభలో ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా ఉన్నత విద్యా శాఖ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి విచారణ కమిటీ ముందు హాజరుకావాలని కిట్‌ వ్యవస్థాపకుడు, మాజీ బిజూ జనతా దళ్‌ ఎంపీ అచ్యుత సామంతతో సహా ఏడుగురు అధికారులు ఉన్నత స్థాయి కమిటీ ఆదేశించినట్లు విభాగం మంత్రి తెలిపారు. ఈ కమిటీ ఇటీవల స్థానిక కిట్‌ విశ్వవిద్యాలయం సందర్శించి దర్యాప్తు ప్రారంభించింది.

ఇంటర్‌ యూనిట్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ద్వివేది


రాయగడ: జేకేపూర్‌లోని జేకే పేపర్‌ మిల్‌ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఇంటర్‌ యూనిట్‌ క్రికెట్‌ టోర్నమెంటు ప్రారంభమయ్యాయి. పేపర్‌ మిల్స్‌ ఉపాధ్యక్షులు వినయ్‌ ద్వివేది ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల్లోని జేకే పేపర్‌ మిల్‌ ప్రాడక్ట్స్‌ యూనిట్ల మధ్య ఈ పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి పోటీల్లో స్నేహబంధాన్ని బలోపేతం చేస్తాయన్నారు. స్థానిక జేకేపూర్‌లోని జేకేపేపర్‌ మిల్‌, రాష్ట్రంలోని సౌరిభా ప్రాంతంలోని ఒడిశా సెంట్రల్‌ పల్ప్‌, తెలంగాణాలోని సిరిపూర్‌ పేపర్‌మిల్‌ కాగజ్‌నగర్‌లకు చెందిన జట్లు పాల్గొన్నట్లు వివరించారు. ఈ నెల 23వ తేదీ వరకు పోటీలు జరుగుతాయి.

కేంద్రబడ్జెట్‌ను నిరసిస్తూ వామపక్షాల ఆందోళన



హైస్కూల్‌ జంక్షన్‌ వద్ద నాయకుల ఆందోళన

పర్లాకిమిడి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ బడా కార్పొరేటర్లకు అనుకూలంగా ఉందని వామపక్ష నాయకులు అన్నారు. రైతులు, రైతుకూలీలు, సామాన్యులకు దగా బడ్జెట్‌గా మారిందని దుయ్యబట్టారు. స్థానిక హైస్కూల్‌ జంక్షన్‌ వద్ద సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్‌ (లిబరేషన్‌), ఆలిండియా కిసాన్‌ సభ, పార్వర్డ్‌ బ్లాక్‌ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. దేశంలో బీమా రంగం నీలపై కేంద్రం వంద శాతం పెట్టుబడులు ఉపసంహరణ చేశారని, విద్య, వైద్యం, వ్యవసాయం పెట్టుబడులను పక్కన బెడుతూ కార్పొరేటర్లకు దక్కేలా బడ్జెట్‌ ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి దండపాణి రైయిత్‌ విమర్శించారు. ఒకపక్క ద్రవ్యోల్బణం పెరిగిపోతుండటం, జాతీయ ఉపాధి హామీ పథకం చేతనదారులకు ఇస్తున్న దినసరి వేతనం 50 శాతం పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జోన్నన సుభాష్‌ చంద్రరావు అన్నారు. ఆందోళన కార్యక్రమంలో సీపీఐఎంఎల్‌ (లిబరేషన్‌) అధ్యక్షులు శ్రీనివాస బెహెరా, లింగరాజ్‌ దోళాయి, ఎ.భాస్కర్‌రావు, ఎం.బంగారి పాల్గొన్నారు.



పర్లాకిమిడి హైస్కూల్‌ జంక్షన్‌ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

బంగారు గనుల వేలం

భువనేశ్వర్‌: రాష్ట్రంలో రెండు జిల్లాల్లో వెలుగు చూసిన బంగారు గనుల్లో ఒక బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలం వేయనుందని ఉక్కు, గనుల శాఖ మంత్రి బిభూతి భూషణ్‌ జెనా తెలిపారు. రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో భాగంగా బిజూ జనతా దళ్‌ సభ్యుడు అశ్విని కుమార్‌ పాత్రో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ దేవ్‌గఢ్‌, కెంఝొహర్‌ జిల్లాల్లోని అదాస్‌, గోపూర్‌ ప్రాంతాలలో బంగారు నిక్షేపాలు కనుగొన్నట్లు వెల్లడించారు. దేవ్‌గఢ్‌ జిల్లా అదాస్‌ ప్రాంతంలో జీ–2 స్థాయిలో పరిశోధనలు నిర్వహించిన జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా (జీఎస్‌ఐ) రాగితో పాటు బంగారం, నికెల్‌, వెండి, గ్రాఫైట్‌ ఖనిజాలను కనుగొంది. నికెల్‌, గ్రాఫైట్‌లను కీలకమైన ఖనిజాలుగా పరిగణిస్తున్నారని పేర్కొన్న మంత్రి ఈ బ్లాక్‌ వేలం ప్రక్రియను గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. కెంఝొహర్‌ జిల్లాలోని గోపూర్‌ ప్రాంతంలో జీ–3 స్థాయిలో బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ పూర్తయింది. 2024–25లో గోపూర్‌ మండలం జోలిదాం ప్రాంతంలో జీ–2 అన్వేషణ కొనసాగుతుందని వివరించారు. అనుబంధ సంస్థలు తుది నివేదిక సమర్పించిన తర్వాత సాంకేతిక కమిటీ సిఫార్సుపై తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

భువనేశ్వర్‌: స్థానిక జగమొరా ప్రాంతంలోని బ్యాటరీ పార్లర్‌లో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్షల రూపాయల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

బంగారం అప్పగింత



మహిళలకు నగలు అందజేసిన పోలీస్‌ అధికారి

జయపురం: బాధిత మహిళలకు మంగళసూత్రాలను కొరాపుట్‌ ఎస్పీ రోహిత్‌ వర్మ, జయపురం సబ్‌ డివిజన్‌ పోలీస్‌ అధికారి అంకిత వర్మ, జయపురం సదర్‌ పోలీసు అధికారి ఈశ్వర్‌ చంద్ర తండి సమక్షంలో శుక్రవారం అందజేశారు. సదర్‌ పోలీసు స్టేషన్‌ పరిధికి చెందిన సింధిగాం ఐసకిడాయి భూత్ర మెడలోని 8 తులాల బంగారు మంగళ సూత్రాలను దొంగలు తెంపుకుపోయిన విషయం విదితమే. గురువారం ఆ నగను దుండగుల నుంచి స్వాధీన పర్చుకుని అప్పగించారు. పేపరు మిల్లు కూడలికి చెందిన ప్రమీల మల్లిక్‌ మెడలోని మంగళ సూత్రాలను దుండగులు తెంపుకుపోయారు. దొంగల నుంచి మంగళసూత్రాలను స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్రపతికి వినతి



రాష్ట్రపతిని కలిసిన ప్రతినిధుల బృందం

రాయగడ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కొరాపుట్‌ ఎంపీ సప్తగిరి శంకర్‌ ఉలక నేతృత్వంలో గిరిజన నాయకుల ప్రతినిధులు శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గిరిజనుల హక్కులు, భాష గుర్తింపు, జొడియా సంప్రదాయలుగా నివసిస్తున్న వారిని రాష్ట్రంలో షెడ్యూల్‌ తెగ జాబితాలో చేర్చించాలని విన్నవించారు. జొడియా తెగలను ఎస్టీలుగా గుర్తించకపోవడంతో ప్రభుత్వ పథకాలను వారు పొందలేకపోతున్నారని, విద్యారంగంలో కూడా నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. కొరాపుట్‌, కలహండి, రాయగడ జిల్లాల్లో అత్యధికంగా నివసిస్తున్న ఈ జొడియా సంప్రదాయానికి చెందిన ఆదివాసీలను ఎస్టీ జాబితాలో గుర్తించేవారు. 1997 అనంతరం ఆ జాబితా నుంచి వీరిని తొలగించడంతో ఇప్పటివరకు వీరు ఆదివాసీలుగా గుర్తింపునకు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వీరిని ఎస్టీ జాబితాలో గుర్తించాలని రాష్ట్రపతిని విన్నవించుకున్నారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో గుణుపూర్‌ ఎమ్మెల్యే సత్యజీత్‌ గోమాంగో, రాంప్రసాద్‌ జొడియా, నందు చరణ్‌ మాఝి, తదితరులు ఉన్నారు.

సేవా పేపరుమిల్లు పునరుద్ధరించాలి

• ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎమ్మెల్యే బాహిణీపతి విజ్ఞప్తి



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోజ్‌ ఆహుజాను కలిసిన ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జయపురం గగణాపూర్‌లోని సేవా పేపరుమిల్లును వెంటనే పునరుద్ధరించాలని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్‌ బాహిణీపతి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్‌ ఆహుజాను గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కొత్త కంపెనీ, థాపర్‌ గ్రూపులు ఎంవోయూ చేసుకొని మిల్లు నడిపేందుకు చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. మిల్లు నడిపేందుకు, మిల్లు మరమ్మతులకు, కార్మికుల బకాయిల చెల్లింపులకు, విద్యుత్‌, నీరు బకాయి బిల్లులు మొదలగునవి చెల్లించేందుకు కొత్త యాజమాన్యం రూ. 200 కోట్లు రుణం తీసుకు వచ్చిందన్నారు. అయితే ఆ డబ్బు ఎంత ఖర్చు చేసిందో రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టుపై ఎమ్మెల్యే ప్రధాన కార్యదర్శితో చర్చించారు. మిల్లు ఏడు నెలలుగా మూత పడి ఉత్పాదన నిలిచిపోయిందని వెల్లడించారు. మిల్లులో ఉత్పాదన ఆగిపోవటంతో ఆ ప్పటి నుంచి కార్మికులకు జీతాలు, పాత బకాయిలు, పీఎఫ్‌, మెడిసిన్‌లకు బకాయిలు చెల్లించలేదని వివరించారు. కార్మికులకు జీతాలు చెల్లించలేక పోవటంతో వారు దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. బకాయిలు చెల్లించాలని ఎంతో కాలంగా కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. 2020, 2023లో న్యూఢిల్లీ వెళ్లి థాపర్‌ బోర్డు డైరెక్టర్లను కలిసి గుణుపూర్‌ పేపరుమిల్లు పరిస్థితిపై చర్చించి వెంటనే మిల్లు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని మిల్లును తెరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కలిమెల సమితిలో దారుణం

• మహిళపై అత్యాచారం ఆపై హత్య



సింగే మృతదేహం



సింగే (ఫైల్‌)

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి గుముకా పంచాయతీలో దారుణం జరిగింది. ఓ మహిళపై అత్యాచారం చేసి అనంతరం ఆమెను హత్య చేశాడో వ్యక్తి. వివరాల్లోకి వెళితే.. గుముకా గ్రామంలో సింగే మడ్కమి (30) అనే మహిళ నివసిస్తుంది. ఆమె భర్త మాల్ల మడ్కమి వలస కూలీగా ఆంధ్రాలో పని చేస్తున్నాడు. వీరి తొమ్మిదేళ్ల కుమారుడు వెంకటాపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్నాడు. సింగే పొలం పనులు చేసుకుంటూ ఒక్కర్తే ఉంటుంది. సింగే ఒంటరిగా ఉంటున్నట్లు తెలుసుకున్న పల్లిమెట్ల గ్రామానికి చెందిన ముక్క పదియామి గురువారం సాయంత్రం ఆమె ఇంట్లో దూరిఉ అత్యాచారం జరిపి అనంతరం చంపేశాడు. సింగే కేకలు విన్న స్థానికులు ఇంటి తలుపులు తెరిచి చూడగా నిందితుడు పారిపోతుండగా పట్టుకొని చెట్టుకు కట్టి దేహశుద్ధి చేశారు. అనంతరం కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసు ఐఐసీ చంద్రకాంత తండ వచ్చి నిందితుడ్ని అరెస్టు చేశారు. అయితే స్థానికులు కొట్టడంతో తీవ్రంగా గాయపడడంతో అతన్ని కలిమెల ఆరోగ్యకేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా సింగే మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు భర్తకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు చెప్పారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌కు ప్రజాదరణ తగ్గలేదు



మాట్లాడుతున్న ఒడిశా పీసీసీ కొత్త చీఫ్ భక్త చరణ్ దాస్

భువనేశ్వర్: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) కొత్త అధ్యక్షుడిగా భక్త చరణ్ దాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెసు భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పట్ల రాష్ట్ర ప్రజల ఆదరణ సజీవంగా కొనసాగుతోంన్నారు. ఓపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టే ముందు పూరీ జగన్నాథుని దర్శించుకునేందుకు సంకల్ప యాత్రలో పాల్గొన్నారు. భువనేశ్వర్ నుంచి పూరీ జగన్నాథుని మందిరం వరకు సుదీర్ఘంగా పాదయాత్ర చేసినట్లు పేర్కొన్నారు. దారి పొడవునా కాంగ్రెసు అభిమానులు, శ్రేయోభిలాషులు విశేష ఆదరణ ప్రదర్శించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పూర్వ వైభవం పునరుద్ధరణ అత్యంత చేరువలో ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మెట్రిక్ పరీక్షలు ప్రారంభం



జయపురం: ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల గేటు ముందు బారులు తీరిన విద్యార్థులు

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు బీఎస్‌ఈ నిర్వహించే వార్షిక ఉన్నత పాఠశాల పరీక్ష (మెట్రిక్యులేషన్) పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఇవి మార్చి 6 వరకు కొనసాగుతాయి. రాష్ట్రంలోని 30 జిల్లాల్లో 3,029 కేంద్రాల్లో 5,12,437 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ప్రారంభమైన రోజున విద్యార్థులు ప్రథమ భాష ఒడియా, బెంగాలీ, హిందీ, ఉర్దూ, తెలుగు, ఇంగ్లిష్ పరీక్ష రాశారు. జవాబు పత్రాల మూల్యాంకనం మార్చి 19 నుంచి ప్రారంభమవుతుంది.

జయపురంలో..

జయపురం: పట్టణంలోని ఆరు కేంద్రాలలో మెట్రిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే అన్ని కేంద్రాలకు విద్యార్థులు హాల్‌టికెట్లతో హాజరయ్యారు. జయపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధాన గేటు ముందు విద్యార్థులు బారులు తీరడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని ఆరు కేంద్రాలలో 1244 మంది రెగ్యులర్, 10 మంది పాత విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష హాల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

రాయగడ: జిల్లాలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున జిల్లాలో 10,340 మందికి 10,136 మంది హాజరయ్యారు. 204 మంది గైర్హాజర్ అయినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి రామచంద్ర నాహక్ తెలిపారు. అలాగే ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 230 మందికి 182 మంది పరీక్షలకు హాజరయ్యారు.

వ్యక్తి హత్య.. తల్లీకుమార్తెల అరెస్టు

జయపురం: ఓ వ్యక్తి హత్య కేసులో తల్లీకుమార్తెలను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శుక్రవారం వెల్లడించారు. హత్యకు గురైన వ్యక్తి జయపురం సమితి ఉమ్మిరి గ్రామానికి చెందిన మనోహర బాగ్(54)గా గుర్తించామన్నారు. మృతుడి భార్య బెలారీ బాగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. వివరాల్లోకి వెళ్తే.. మనోహర్ తన స్నేహితుడితో కలిసి బుధవారం రాత్రి ఫూల్‌బెడ గ్రామానికి వెళ్లగా.. అక్కడ జొగా, బలియ అనే అన్నదమ్ములు వీరితో అకారణంగా గొడవపడి కొట్టారు. మనోహర్ ఇంటికి వచ్చి తన కజిన్ సూరజ్ భాగ్‌కు విషయం చెప్పారు. అనంతరం సూరజ్‌బాగ్, మనోహర బాగ్, రాజేష్ నాగ్‌లు కలసి ఫూల్‌బెడ వెళ్లి జొగా, బలియలను హెచ్చరించాడు. ఈ క్రమంలో మనోహర్ ఉంగరం పోవడంతో గొడవ జరిగింది. ఇంతలో బలియ కత్తితో మనోహర్ కడుపులో పొడిచాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. ఈ ఘటనలో నిందితులు దుర్గ, రూపలను అరెస్టు చేశామని, జొగ, బలియలు పరారీలో ఉన్నట్లు పోలీసు అధికారి తెలిపారు. సదర్ ఎస్‌ఐ శిరీష్ మహాపాత్రో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేటలో ఈ నెల 28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సైనికోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు 3,4,5 తరగతుల విద్యార్థులు అర్హులని, వివరాలకు 9441569363 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పర్యాటక ప్రాంతాన్ని పరిరక్షించండి

- జయపురం సిటిజన్ కమిటీ విజ్ఞప్తి



మాట్లాడుతున్న సురేష్ దాస్ తదితరులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితిలోని ఘులిమి పర్యాటక ప్రాంతాన్ని పరిరక్షించాలని జయపురం సిటిజన్ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. స్థానికంగా ఉన్న ఓ సమావేశ హాల్‌లో సిటిజన్ కమిటీ అధ్యక్షులు మీన కేతన దాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుద్ధిజీవి, సీనియర్ సిటిజన్ డాక్టర్ సురేష్ దాస్ మాట్లాడారు. ఒడిశా జళ, జంగిల్, భూములను వినియోగ పరచుకుంటూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీ ఘులిమి ప్రాంతంలో విద్యుత్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పాదన చేస్తున్నదని ఆరోపించారు. అటవీ విభాగ అనుమతిని నకిలీ సంతకాలతో నాలుగు మీటర్ల ఎత్తుకు బదులు 12 మీటర్ల ఎత్తున డామ్ నిర్మిస్తోందన్నారు. ఎప్పటికప్పుడు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నప్పటికీ అటవీ, ఇరిగేషన్ అధికారులు స్పందించటం లేదన్నారు. ఆ కంపెనీ కొండలను తవ్వటం, అడవిలో చెట్లు నరకటం చేస్తుందన్నారు. జళ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు వలన విద్యుత్ ఉత్పాదనతో పాటు స్థానిక యువతీ యువకులకు ఉద్యోగాలు లభిస్తాయన్న అభిప్రాయంతో ఈ ప్రాజెక్టు కు అనుమతిఇచ్చారని గుర్తు చేశారు. 2002లో బీజేడీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీకి ఒప్పందం కుదుర్చుకున్నా నేటికీ విద్యుత్ ప్రాజెక్టు పనులు పూర్తికాలేదన్నారు. డ్యామ్ నిర్మాణం వలన ఘులిమి జలపాతం చిక్కిపోయిందని, మట్టి పెళ్లలు జారిపడటంతో ప్రాజెక్టుకు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానిక, జిల్లా పాలన యంత్రాంగానికి తెలియజేసినట్టు వెల్లడించారు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. డుమజోడిలో జళ విద్యుత్ ప్రాజెక్టు కోసం 2002లో 50 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర విద్యుత్ విభాగంతో ప్రయివేట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 54.25 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతోందని అంచనా వేశారన్నారు. అయితే నేటికి 22 ఏళ్లు గడచినా ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. ఈ విషయంపై జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ ద్వారా తెలియ జేశారని దాస్ వెల్లడించారు. సమావేశంలో సమాజ సేవకుడు బసంత పాత్రో పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



కోయిపూర్ వద్ద లక్ష్మీబాబాతో మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ మహేంద్రగిరిలో జిల్లా కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ శుక్రవారం పర్యటించారు. ఈ నెల 25, 26 తేదీల్లో మహేంద్రంలో మహాశివరాత్రి ముందు రోజు నుంచి యాత్రికులు కొండపైకి రానున్న దృష్ట్యా తాగు నీరు, విద్యుత్, షామియానాలు, యాత్రికుల భద్రతపై అధికారులతో సమీక్ష చేపట్టారు. మహేంద్రగిరి పుణ్యక్షేత్రం పరిరక్షకులు భాస్కర తీర్థ లక్ష్మీ బాబాతో కలెక్టర్, డీఎఫ్‌ఓ సుబ్రహ్మణ్యం ఆనంద్, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు చర్చించారు. కుంతీ మందిరం వద్ద పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఉండాలని సబ్ డివిజన్ పోలీసు అధికారి మాధవానంద నాయక్‌కు కలెక్టర్ ఆదేశించారు. రాయఘడ బ్లాక్ బీడీఓ, తహసీల్దార్, అధికారులు పాల్గొన్నారు.



బుర్‌ఖాత్ పాస్- కోయిపూర్ వద్ద రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వెనక్కు పరుగులు తీస్తున్న డబుల్ ఇంజిన్ సర్కారు

- బడ్జెట్ సమావేశంలో విపక్ష నేత నవీన్

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి సారిగా పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీ ప్రవేశ పెట్టిన కొత్త ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌పై సభలో చర్చ కొనసాగింది. విపక్ష బిజూ జనతా దళ్ బీజేడీ నేత నవీన్ పట్నాయక్ శుక్రవారం సభలో ప్రసంగించారు. తొలి సారిగా బడ్జెటు ప్రవేశపెట్టినందుకు బీజేపీ ప్రభుత్వానికి తొలుత అభినందించారు. ఒడిశాను ముందుకు తీసుకెళ్తానన్న డబుల్ ఇంజన్ బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు విపరీత దిశలో వెనుకకు వెళ్తున్నట్లు కనిపిస్తోందని దుయ్యబట్టారు. ఇంతకు ముందు పరివర్తనకు పేరుగాంచిన ఒడిశా ఇప్పుడు పేరు, రంగును మార్చడానికి మాత్రమే పరిమితం అవుతుందని నవీన్ వ్యాఖ్యానించారు. బిజూ జనతా దళ్ ప్రభుత్వ హయాంలో ఒడిశా అధిక వృద్ధి రాష్ట్రంగా కొనసాగిందని గుర్తు చేశారు. లక్షలాది మందిని పేదరికం నుంచి ఉన్నత స్థాయి ఎదుగుదలకు దోహదపడిందన్నారు. అనేక కేంద్ర సంస్థలు ఈ వాస్తవాన్ని విశ్లేషించి తాజాగా పలు నివేదకల్ని వెల్లడించడం తార్కాణంగా పేర్కొన్నారు. హామీలు, అభయాలకు భిన్నంగా రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పాలనలో ఈ ఏడాది వృద్ధి రేటును 10 శాతం నుంచి 8 శాతానికి దిగజారడం అత్యంత విచాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి గత ఏడాదితో పోలిస్తే బడ్జెట్ పరిమాణం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని బీజేడీ ప్రభుత్వం ఏటా బడ్జెట్ పరిమాణం విస్తరించేదని, రాష్ట్ర ఆదాయ వనరులను ఎలా విస్తరించాలనే ఆలోచన కొత్త ప్రభుత్వానికి లేదని దీన్నిబట్టి తెలుస్తోందని చెప్పారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వ హయాంలో ఒడిశా బహిరంగ మార్కెట్ రుణ భారం ఈ సంవత్సరం 46 వేల కోట్లకు మించి పెరిగిందన్నారు. తలసరి రుణ భారం ఏటా పెరుగుతోందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గండి కొడుతుందని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం రెట్టింపు ప్రయోజనం చేకూరుస్తుందని ప్రజలకు హామీ ఇచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ ఇప్పుడు రెట్టింపు శూన్యమైన దుస్థితిలో రాష్ట్ర పరిస్థితి అగమ్య గోచరంగా తయారు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం కోసం అర్థించకుండా స్వీయ వనరులతో అభివృద్ధి ప్రాజెక్టులు ముందుకు నడిపించగలిగే సాధికారిత దిశలో కొత్త ప్రభుత్వం సాగాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో సమగ్ర సిటీ రోడ్ డీకంజెషన్ ప్లాన్, భువనేశ్వర్ ప్రాంతంలో ట్రాఫిక్‌ని తగ్గించే ప్రణాళికపై ప్రసంగించిన విపక్ష నేత పెదవి విరిచారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టుకు కేటాయింపులను తగ్గించిందని ఆరోపించారు. 'స్కిల్డ్ ఇన్ ఒడిశా' పేరును 'స్కిల్డ్ ఫర్ ది వరల్డ్'గా మార్చడం ఒడిశా యువతకు ఎలా సహాయపడుతుందని ప్రశ్నించారు.

దక్షిణ ఒడిశాకు కీలక రైలు ప్రాజెక్టులు



భువనేశ్వర్: రైల్వే శాఖ దక్షిణ ఒడిశా బహుముఖ పురోగతి లక్ష్యంతో పలు భారీ ప్రాజెక్టుల్ని మంజూరు చేసింది. ప్రధానంగా మారుమూల ప్రాంతాలకు రైలు అనుసంధానం కల్పించే దిశలో ఈ ప్రాజెక్టులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నిత్య రవాణా వ్యయ ప్రయాసల్ని కుదించి సరుకు రవాణాతో వ్యవసాయం, గనులు, పారిశ్రామిక రంగాలకు చేయూతగా నిలిచి ఆర్థిక పురోగతికి దోహదపడతాయని రైల్వే శాఖ యోచిస్తోంది. దక్షిణ ఒడిశా ప్రాంతానికి విస్తృత రైలు రవాణా అనుసంధానం కోసం మార్గం సుగమమైంది. రాయగడ, గోపాలపూర్, గుణుపురం, తేరువాలి ప్రాంతాలకు రైలు అనుసంధానం ప్రాజెక్టులకు రైల్వే శాఖ ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొత్త రైలు లైన్ల నిర్మాణం, డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రైల్వే శాఖ మంజూరు చేసింది. రాష్ట్ర రైల్వే రంగంలో ఈ మంజూరు మైలురాయిగా నిలుస్తుంది. దక్షిణ ఒడిశా రైలు రవాణా నెట్‌వర్క్ భారీగా మెరుగుపడనుంది. రైలు మార్గం అనుసంధానంతో ఈ ప్రాంతీయులకు రవాణా ఖర్చులు తగ్గి ఆర్థిక వృద్ధి నోచుకుంటుంది.

- గోపాల్‌పూర్ రాయగడ మధ్య 250 కిలోమీటర్ల పొడవైన కొత్త రైలు మార్గం, నౌపడ – గుణుపురం – తేరువాలి రైలు మార్గం డబ్లింగ్ ప్రాజెక్టులు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల వ్యయ ప్రణాళిక రూ.9.65 కోట్లు. వీటి నిర్మాణం రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల మధ్య అనుసంధానం మెరుగుపరిచేందుకు దోహదపడుతుంది.
- రూ.1,326 కోట్ల వ్యయ ప్రణాళికతో గుణుపురం – తేరువాలి మధ్య 73.62 కిలోమీటర్ల పొడవైన కొత్త రైలు లైను ప్రాజెక్టుకు రైల్వే శాఖ మంజూరు చేయడం విశేషం. ఈ ప్రాజెక్టులో భాగంగా రాయగడ జిల్లా పరిధిలో ఏడు కొత్త స్టేషన్లు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్ట్‌తో రాయగడ జిల్లాకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 473.78 హెక్టార్ల విస్తీర్ణపు భూమి కేటాయించనుంది. రానున్న ఐదేళ్లలో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసేలా కాల పరిమితి నిర్ధారించారు.
- గోపాల్‌పూర్ – రాయగడ, గుణుపురం – తేరువాలి రైలు మార్గం ప్రాజెక్టులు రవాణా సామర్థ్యం మెరుగుపరచి రవాణా వ్యయ ప్రయాసల్ని కుదిస్తాయి. దక్షిణ ఒడిశా ప్రాంతంలో అపారమైన ఆర్థిక ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. కొత్త రైలు మార్గం సిమెంటు, వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజ పదార్థాలు, నిత్యావసర వస్తువుల సత్వర రవాణాకు అందుబాటులోకి రావడంతో ఆర్థిక పురోగతి శరవేగంగా పుంజుకుంటుంది.

పెళ్లి పేరుతో యువతిని మోసగించిన వైద్యుడు అరెస్టు



అరెస్టయిన వైద్యుడు అమిత్

మల్కన్‌గిరి: పెళ్లి పేరుతో యువతిని మోసగించిన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు ఆరోగ్య కేంద్ర వైద్యుడు అమిత్ కుమార్ సాహును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..2019లో సబల్‌పూర్ జిల్లా జమాన్‌కిర గ్రామం నుంచి అమిత్ కుమార్ సాహూ కలిమెల మోటు ప్రాంత ఆరోగ్య కేంద్రానికి వైద్యుడుగా వచ్చారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఆదివాసీ యువతితో పరియం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. పెళ్లి చేసుకోవాలని వైద్యుడ్ని ఎన్నిసార్లు ఆ యువతి కోరినప్పటికీ ఏదో కారణం చేసి తప్పించుకునేవాడు. నాలుగు సంవత్సరాలు ఇలాగే తప్పించుకున్నాడు. తరువాత 2023లో తిరిగి సంభల్‌పూర్‌కి వెళిల్పోయారు. ఆ తరువాత కూడా ఆమెతో ఫోన్ ద్వారా మాట్లాడేవారు. అయితే పెళ్లి పేరుతో కాలయాపన చేసిన వైద్యుడు మాత్రం మాట నిలుపుకోలేదు. రెండు నెలల క్రితం కోరుకొండ సమితికు బదిలీపై వచ్చాడు. అయితే ఆ తరువాత ఫోన్‌లో కూడా ఆమెతో మాట్లాడడం మానేడు. ఈ విషయం యువతికి తెలియడంతో తల్లిదండ్రులతో కలిసి కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ప్రశ్నించింది. అయితే నెల 17 తన గ్రామంలో మరో యువతితో వైద్యుడు వివాహం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ప్రేమించిన యువతి మల్కన్‌గిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఓ బృందాన్ని జిల్లా ఎస్పీ వినోద్ పటేల్ సంభల్‌పూర్‌కి పంపి అమిత్‌ను అరెస్టు చేసి.. మల్కన్‌గిరికి తీసుకొచ్చి విచారించారు. అనంతరం కోర్టుకు తరలించారు.

శివాలయంలో అరుదైన తాబేలు



గుడిలో తాబేలు

మల్కన్‌గిరి: కలిమెల సమితి గంపకొండ పంచాయతీ ఎం.వి.66 గ్రామంలోని ఓ శివాలయంలో శుక్రవారం అరుదైన తాబేలు(నక్షత్ర తాబేలు) దర్శనమిచ్చింది. గోధుమ రంగులో శివుడి పాదాల వద్ద తాబేలు కనిపించడంతో వెంటనే పూజారి బయటకు వచ్చి స్థానికులకు విషయం చెప్పారు. పలువురు భక్తులు కొబ్బరి, అరటిపండ్లు నైవేద్యంగా సమర్పించారు.

మామ దాడిలో అల్లుడు మృతి



బిద్యా జొడియా మృతదేహం

రాయగడ: మామ దాడిలో గాయపడిన అల్లుడు మృతి చెందాడు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముండాగా గ్రామంలో చోటు చేసుకున్న ఈ దారుణంలో బిద్యా జొడియా (20) ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న టికిరి ఐఐసీ విశ్వనందిని బాగ్, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి స్థలంకు చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత సోమవారం గ్రామంలో మాఘ పండుగ సందర్భంగా మామ బుడు జొడియా, అల్లుడు బిద్యా జొడియాలు పూటుగా మద్యం సేవించారు. కుటుంబానికి సంబంధించి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సహనం కోల్పోయిన మామ బుడు జొడియా తన అల్లుడు బిద్యా జొడియాపై కర్రతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో అతన్ని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం తరలించారు. చికిత్స అనంతరం కొలుకున్న బిద్య తిరిగి తన గ్రామానికి వెళ్లిపోయాడు. అయితే గురువారం మళ్లీ అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంలో మృతి చెందాడు. దీనిపై బిద్యా తల్లిదండ్రులు టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు మామ బుడు జొడియాను అదుపులోకి తీసుకున్నారు. మూడేళ్ల క్రితం బిద్యా జొడియాకు ముండాగా గ్రామానికి చెందిన బుడు జోడియా కూతురితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కొడుకు ఉండగా ప్రస్తుతం బిద్యా భార్య ఐదు నెలల గర్భిణి.



ఒత్తిడిని ఉఫ్ అనండి..

విజేత మీరేనండి..!

- మార్చి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- పక్కాగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఒత్తిడిని జయిస్తే విజయం నులువేనంటున్న నిపుణులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

విద్యార్థి దశలో అత్యంత ముఖ్యమైన పబ్లిక్ పరీక్షలకు సమయం సమీపిస్తోంది. ఇంటర్ పరీక్షలకు వారం రోజులు, టెన్త్ పరీక్షలకు 25 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. పరీక్షలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ఎక్కువసార్లు రివిజన్ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అయితే ఇదే సమయంలో ఒత్తిడిని జయిస్తేనే విజయంవైపు సులభంగా వెళ్లగలమని నిపుణులు సూచిస్తున్నారు. టెన్షన్ పడితే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

75 కేంద్రాల్లో పరీక్షలు

జిల్లాలో మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, టెన్త్‌క్లాస్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి మొదలవ్వనున్నాయి. జిల్లావ్యాప్తంగా 75 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 40,356 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక పదో తరగతి పరీక్షలను 149 కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా.. 28,984 మంది విద్యార్థులు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులు 807 మంది, ఇంటర్ విద్యార్థులు 1,553 మంది పరీక్షలకు ఫీజులు చెల్లించారు. ఈ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



పుస్తకాలతో కుస్తీ



పరీక్షలకు సమయం సమీపిస్తుండడంతో పిల్లలు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని మొత్తం 410 ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను రివిజన్ చేయిస్తున్నారు. పక్కా ప్రిపరేషన్‌తో మంచి మార్కులు సాధించేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేస్తున్నారు. ఒత్తిడిని జయించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను సూచిస్తున్నారు. పరీక్షల సమయంలో ఆందోళనకు గురవ్వకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉత్తమ మార్కులు సాధించవచ్చని చెబుతున్నారు.

సమయమే ముఖ్యం



సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే అంశంపైనే సాధించే మార్కుల శాతం ఆధారపడి ఉంటుంది. సబ్జెక్టు, టాపిక్ ప్రాధాన్యతలను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయింపు చేసుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు స్వల్ప విరామం ఇవ్వడం వల్ల మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది.

– కె.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల

చేతిరాతపై దృష్టి పెట్టాలి



నీ పని నువ్వు శ్రద్ధగా చేయ.. ఫలితం దానంతట అదే వస్తుందన్న నానుడిని విద్యార్థులు మరువకూడదు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. రివిజన్ పదేపదే చేస్తుండాలి. వెనుకబడిన సబ్జెక్టులు, టాపిక్‌లపై ఎక్కువ దృష్టి సారించాలి. ఒత్తిడిని జయించేందుకు ఉపాధ్యాయులు సూచనలు చేస్తుండాలి. మార్కులకు దోహదం చేసే చక్కటి చేతిరాతపైనా దృష్టి పెట్టాలి.

– బలివాడ మల్లేశ్వరరావు, విశ్రాంత డీఈవో

ఆరోగ్యమే మహాభాగ్యం



ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. అందువల్ల ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. అలాగే తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా కొద్ది సమయం వ్యాయామం చేయగలిగితే శరీరం యాక్టివ్‌గా ఉంటుంది. ముఖ్యంగా ఫలితం గురించి ఆలోచించకుండా, మానసికంగా ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకోవాలి.

– డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ కుమార్, సన్‌రైజ్ ఆస్పత్రి ఎండీ, శ్రీకాకుళం

రాష్ట్రంలో వడగళ్ల వాన

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈ నెల 23 వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, వడగళ్ల వానతో పాటు వాతావరణం కొనసాగవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. పశ్చిమ బెంగాల్ (గంగా నది) నుంచి తెలంగాణ వరకు ఉన్న ద్రోణి ఇప్పుడు ఉత్తర బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ (గంగా నది), ఒడిశా అంతర్గత మరియు దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ వరకు కదులుతోందని వాతావరణ శాఖ సమాచారం. శనివారం భద్రక్, మయూర్ భంజ్, కెంజొహర్ ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

131 లీటర్ల సారా స్వాధీనం



సారాతో పట్టుబడిన నిందితులు

జయపురం: జయపురం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అబ్కారి అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి 131 లీటర్ల నాటు సారా పట్టుకున్నారు. 6.5 లీటర్ల విదేశీ మద్యం కూడా స్వాధీనం చేసుకున్నట్లు జయపురం అబ్కారి అధికారి సుబ్రత్ కేశరీ హిరన్ వెల్లడించారు. జయపురం సదర్ స్టేషన్ ఉమరపిండి గ్రామంలో ధనుర్జయ బైక్‌పై 50 లీటర్ల నాటు సారా తీసుకువెళ్తుండగా పట్టుకున్నామన్నారు. అదే గ్రామానికి నాటు సారా తీసుకువెళ్తున్న పాతి భూమియ నుంచి 9 లీటర్లు ,శ్యామఘన బిశాయి వద్ద 30 లీటర్ల, రతన్ కిరసాని వద్ద 20 లీటర్లు, దుర్యోధన బిశాయి వద్ద 10 లీటర్లు, కేశవ నాగ్ వద్ద 9 లీటర్లు, సెనాపతి హరిజన్ వద్ద 6.5 లీటర్ల విదేశీ మద్యంతోపాటు 3 లీటర్ల నాటు సారా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఏడుగురు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ చంద్రశేఖర పాడిహారి, రాజుకుమార్ ఖొడి, అబ్కారి ఇన్‌స్పెక్టర్ శశి కాంత దత్త, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నకిలీ స్టాంపులు విక్రయిస్తే కఠిన చర్యలు

- సబ్‌రిజిస్ట్రార్ శ్రీనువాసులు
- సాక్షి కథనానికి స్పందన



శుక్రవారం సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: మండల కేంద్రంలో స్టాంపులను కలర్ జిరాక్స్ తీసి విక్రయిస్తున్నారని శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన 'జోరుగా నకిలీ స్టాంపుల విక్రయాలు' కథనంపై అధికారులు స్పందించారు.ఈ మేరకు పాలకొండ సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం తయాచేస్తున్న స్టాంపుల మాదిరిగా నకిలీవి తయారుచేస్తే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని సబ్ రిజిస్ట్రార్ హెచ్చరించారు.కొద్దిరోజుల్లో వీరఘట్టం-పాలకొండ పట్టణాల్లో కలర్ జిరాక్స్‌లు తీస్తున్న అన్ని షాపులు తనిఖీ చేస్తామన్నారు. అలాగే ప్రజలు కూడా తమ అవసరాలు కోసం ప్రైవేట్ షాపుల్లో కొనుగోలు చేస్తున్న స్టాంపులు నకిలీవా? ఒరిజినల్‌వా? అని పరిశీలించుకోవాలని సూచించారు. స్టాంపుల విక్రయాలకు ప్రైవేట్ జిరాక్స్ షాపులకు ఎటువంటి అనుమతులు లేవని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఖలీల్‌బాబుకు స్పిరిట్యువల్ సైంటిస్ట్ అవార్డ్



స్పిరిట్యువల్ సైంటిస్ట్ అవార్డు అందుకుంటున్న ఖలీల్‌బాబు

విజయనగరం టౌన్: విశ్వసమైక్యతకు కృషిచేస్తున్న సూఫీ పరంపర వారసుడు, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఖలీల్‌బాబుకు ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్, ఆంధ్రాయూనివర్సిటీ అనుబంధ డీన్ వాన్‌ల్యూవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్, ఆంధ్రా యూనివర్సిటీ సంయుక్తంగా స్పిరిట్యువల్ సైంటిస్ట్ అవార్డును అందజేశాయి. ఈ మేరకు శుక్రవారం డీన్‌వాన్ వాన్‌ల్యూవెన్ సెంటర్ ఈడీ చల్ల కృష్ణ విజయనగరంలో ఉన్న దర్గాకు వచ్చి ఖలీల్‌బాబును సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఖాదర్‌బాబాపై భక్తితో తాను స్వయంగా రాసిన ఇంగ్లీష్ కవితలతో కూడిన పుస్తకాన్ని ఖలీల్‌బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ పీవీ.గోపాలరాజు, అహమ్మద్ బాబు, రంగారావు బాబాయ్, సంతోష్, జ్ఞానేశ్వర్, ఖాదర నాగూర్ పాల్గొన్నారు.

బత్తిలి పోలీసుల ఔదార్యం

- ఆరు తులాల బంగారంతో బ్యాగ్ అప్పగింత

భామిని: మండలంలోని బత్తిలి పోలీసులు బంగారం పోగొట్టుకొన్న బాధితుల విషయంలో శుక్రవారం తమ ఔదార్యం చాటుకుని ఆదర్శంగా నిలిచారు. బత్తిలి వచ్చే ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ఆరు తులాల బంగారు వస్తువులతో ఉన్న బ్యాగ్‌ను బాలేరుకు చెందిన బాధితులు వడ్డివాడ రామకృష్ణ దంపతులకు అప్పగించి ప్రజల మెప్పు పొందారు. కొత్తకోట నుంచి ఆర్టీసీ బస్సులో బాలేరు వస్తూ బంగారు వస్తువులు ఉన్న బ్యాగ్ మరిచిపోయి వారు దిగిపోయారు. వెనువెంటనే బాలేరు వైఎస్సార్ సీపీ నాయకుడు మేడిబోయిన చలపతి ఆధ్వర్యంలో బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో బత్తిలిస్టేషన్ సిబ్బందికి సమాచారం అందించి ఆర్టీసీ బస్సులో బంగారు వస్తువులతో గల బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. బత్తిలి స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు చలపతి సమక్షంలో బాధితులకు బంగారు వస్తువుల బ్యాగ్ అందించి పలువురి మన్ననలు పొందారు.

ముగిసిన దుర్గాలమ్మ తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామదేవత దుర్గాలమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 8 ఎడ్లబళ్లు పాల్గొనగా వాయిల్పాడుకు చెందిన శ్రీమరిడిమాంబ ఎడ్లు ప్రథమస్థానం సాధించాయి. కలగాడకు చెందిన పోలిపర్తి సత్తిబాబు ఎడ్లు ద్వితీయ స్థానం, వావిలపాడుకు చెందిన పరిదేశమ్మతల్లి ఎడ్లు తృతీయ స్థానం, దేవరాపల్లికి చెందిన వీరాంజనేయ ఎడ్లు నాలుగవ స్థానం, దేవరాపల్లికి చెందిన శ్రీలక్ష్మీనరసింహ ఎడ్లు 5వ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

26న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

బొండపల్లి: ఈనెల 26న మండలంలోని కొత్తపాలెం గ్రామంలో శ్రీ కృష్ణమ్మ పేరంటాలు తల్లి మహోత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలతో పాటు ఎడ్లబళ్ల ప్రదర్శన పోటీలు, గుర్రపు స్వారీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, గ్రామ సర్పంచ్ బొడ్డు సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.4 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీల్లో విజేతలకు నగదు పారితోషకాలను అందజేయడంతో పాటు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, పోటీదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలివ్‌రిడ్లీల కోసం...





తాబేళ్ల గుడ్లకు సంరక్షణా తీరంలో ఏర్పాటుచేసిన హేచరీ

- వాటి సంరక్షణ కోసం అటవీశాఖ చర్యలు
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో తీరంలో హేచరీస్‌ల నిర్వహణ
- గుడ్లను సంరక్షించి పిల్లలుగా పొదిగించే ఏర్పాట్లు
- తాబేళ్ల సంరక్షణపై మత్స్యకారులకు అవగాహన



కృతిమంగా గుడ్లను పొదిగించేందుకు ఏర్పాట్లు

విజయనగరం గంటస్తంభం:

ఆలివ్ రిడ్లీలు... పర్యావరణ హితులు. ఇవి ఎక్కడ కనిపిస్తే అక్కడ పర్యావరణం బాగుందని అర్థం. మన దేశానికి పశ్చిమాన ఉన్న ఆరేబియా మహాసముద్ర తీరప్రాంతంలోని గుజరాత్ నుంచి తూర్పున బంగాళాఖాతం తీరమైన ఒడిశా వరకు పలు తీర ప్రాంతాల్లో ఇవి నివసిస్తాయి. తీరంలో ఇసుక గుంటలు ఉన్న డెల్టా ప్రాంతాలను సంతతి వృద్ధికి అనువైనవిగా భావిస్తాయి. అలల ఉధృతి లేని, బోట్ల శబ్దాలు వినిపించని, కలుషిత జలాలు లేని తీరంలో సూర్యచంద్రుల గురుత్వాకర్షణ శక్తి వంటివి గమనిస్తూ ఒక నిర్దిష్ట ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని గూడు కడతాయి. ఒక్కో పెద్ద ఆడతాబేలు 100 నుంచి 130 వరకు ఆ గూడులో గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతుంది. వీటి సంరక్షణకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. విజయనగరం తీర ప్రాంతంలో ప్రత్యేకంగా హేచరీస్‌లు ఏర్పాటుచేసి ఆలివ్‌రిడ్లీ సంరక్షణ, సంతతి వృద్ధికి పాటుపడుతోంది. ప్రస్తుతం ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల సంతతి సమయం కావడంతో గుడ్లను సంరక్షించి.. పొదిగించే ఏర్పాట్లు చేస్తోంది.

పది హేచరీస్‌ల ఏర్పాటు

జిల్లాలోని తీరప్రాంతమైన బొడ్డుగుయ్యపేట, తిప్పలవలసల్లో రెండేసి, చేపలకంచేరు, ముక్కాం, చోడిపల్లిపేట, పులిగెడ్డపాలెం, బర్రిపేట, చింతపల్లిలో ఒక్కొక్కటి చొప్పున హేచరీస్ ఏర్పాటు చేశారు. పది హేచరీస్‌లలో 246 తాబేళ్ల పొదుగుల(నెస్ట్)ను ఏర్పాటుచేసి గుడ్లను భద్రపరుస్తున్నారు. గుడ్లను కృత్రిమంగా పొదిగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు 27,449 గుడ్లను సేకరించి, గురువారం నాటికి 104 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. మిగిలిన వాటిని కూడా పిల్లలు అవ్వగానే తగు జాగ్రత్తలు తీసుకొని విడిచిపెడతామని అధికారులు తెలిపారు. గుడ్ల సంరక్షణకు 25 మంది సిబ్బందిని నియమించామని, ట్రీ ఫౌండేషన్ సంస్థ కూడా తోడ్పాటు అందిస్తోందని పేర్కొన్నారు.

గుడ్లకు అనువైన ప్రాంతం

తాబేళ్ల గుడ్లు పెట్టేందుకు జనవరి నుంచి ఏప్రిల్ వరకు నాలుగునెలలు అనువైనవి. విజయనగరం జిల్లా తీర ప్రాంతానికి గుడ్లు పెట్టేందుకు ఏటా ఆలివ్‌రిడ్లీలు వస్తాయి. చంపావతి నది సముద్రంలో కలిసే చోట ఎక్కువగా తల్లితాబేళ్లు గూళ్లు కడతాయి. ఇక్కడ తాబేళ్లు పెట్టే గుడ్లను ఎవరూ తీయకుండా, కుక్కలు, నక్కలు బారిన పడకుండా, వాటి సంరక్షణకు ఎనిమిదేళ్ల నుంచి ట్రీఫౌండేషన్ సహకారంతో అటవీశాఖ హేచరీస్‌లను ఏర్పాటు చేస్తోంది.

తాబేళ్ల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత. ప్రతి 40-45 నిమిషాలకు ఒకసారి అవి నీటిపైకి రావాలి. చేపల వలల్లో చిక్కుకుని ఎక్కువగా చనిపోతున్నాయి. తాబేళ్లకు హాని చేయని వలలనే వాడాలని తీరం వెంబడి ఉండే మత్స్యకారులకు సూచిస్తున్నాం. చంపావతి నది సముద్రంలో కలిసే చోట ఎక్కువగా గుడ్లు పెడుతుంటాయి. వీటిని సంరక్షరిస్తున్నాం. గుడ్లను హేచరీస్‌లలో పొదిగించి పిల్లలను సంద్రంలో విడిచిపెడుతున్నాం.

– ఆర్.కొండలరావు, జిల్లా అటవీశాఖ అధికారి

గత ఐదేళ్లలో హేచరీస్ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టిన తాబేళ్ల వివరాలు

సంవత్సరం	తాబేళ్ల పొదుగుల సంఖ్య	సేకరించిన గుడ్లు సంఖ్య	సముద్రంలోకి విడిచిపెట్టిన తాబేళ్ల పిల్లలు	పిల్లలుగా మారని గుడ్ల శాతం
2019-20	128	14,184	13,478	4.72
2020-21	160	17,277	16,080	6.92
2021-22	215	24,317	23,431	3.64
2022-23	215	23,663	22,649	4.76
2023-24	169	18,784	17,716	3.845
2024-25	246	27,449	104(20.02.2025 వరకు)	

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

- గుడ్లు, మాంసం రవాణాపై ఆంక్షలు లేవు
- పశు సంవర్ధక శాఖ జేడీ వైవీ రమణ

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల పెంపకం పరిశ్రమ కలిగిన రైతులు, పౌల్ట్రీ యాజమానులు జిల్లాలోని కోళ్లకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా జీవ భద్రత చర్యలు చేపట్టాలని పశు సంవర్ధకశాక జేడీ డాక్టర్ వైవీ రమణ తెలిపారు. కోళ పరిశ్రమ యాజమానులు, రైతులకు శుక్రవారం పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, గుడ్లు, కోడి మాంసం ఉత్పత్తులను 100 డిగ్రీల సెంటీగ్రేడ్‌లో వండుకుని ప్రజలు అందరూ నిర్భయంగా తినొచ్చని పేర్కొన్నారు. కోడిగుడ్లు, మాంసం ఉత్పత్తులపై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్‌తో కలిసి పశు సంవర్ధకశాఖ త్వరలో కోడిమాంసం, గుడ్ల వంటకాలతో జిల్లా కేంద్రంలో త్వరలోనే ఒక మేళాను నిర్వహించి ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో బహుళార్ధ పశు వైద్యశాల ఉప సంచాలకురాలు డాక్టర్ జి.మహాలక్ష్మి, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకుడు డాక్టర్ ఎంబీవీ ప్రసాద్, ఎ.డి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా 'శారద' జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

- ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన 9 జట్లు
- రెండు రోజుల పాటు జరగనున్న పోటీలు



ఉత్కంఠభరితంగా సాగుతున్న వాలీబాల్ పోటీలు



9 నియోజకవర్గాల క్రీడాకారులతో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, శారద కర్మాగారం ప్రతినిధులు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయీస్ లిమిటెడ్ కర్మాగారం సహకారంతో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు కొత్తవలస -విజయనగరం రోడ్డులో గల బారత్ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌లో శుక్రవారం ఉల్లాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, శారద పరిశ్రమ వైస్‌ప్రెసిడెంట్ సనత్ కుమార్, ప్రభాత్ మోహన్ ప్రారంభించారు. జాతీయ వాలీబాల్ కోచ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవర సూరిబాబు, స్కూల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె.కృషంరాజుల నిర్వహణలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో గల 9 నియోజకవర్గాల నుంచి ఒక్కో టీమ్ వచ్చినట్లు తెలిపారు. ప్రతి టీమ్‌కు 10 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ పోటీలు లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.1,25,000, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.60,000, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30,000, నాల్గోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.25,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, క్రీడాకారులకు టీషర్టులను, బాల్స్, నెట్‌లను శారద కర్మాగారం సమకూర్చినట్లు తెలిపారు. శనివారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కడారి రాజు, సర్పంచ్‌లు మదినా అప్పలరమణ, పీతల కృష్ణ, శారద కార్మగారం ప్రతినధులు ఆశోక్ కుమార్ చౌదరి, మూర్తి, హెచ్.సన్యాసిరావు, జి.శంకరావు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా



గెలిచిన టీమ్‌లకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత సురానా

సాలూరు రూరల్: పార్వతీపురం జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గడిచిన మూడు నెలల పాటు నిర్వహించి శుక్రవారం మండలంలోని తోణాం గ్రామంలో సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో సాలూరు మండలం మెండంగి గిరిజన యువత విజేతలుగా నిలిచారు. అలాగే ద్వితీయ స్థానంలో మక్కువ మండలం కోన టీమ్ గెలుపొందింది. గెలుపొందిన టీమ్‌లకు ఎస్పీ మాధవ రెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా మహరాణా బహుమతులు అందజేశారు. అలాగే సెమీ ఫైనల్‌లో పాల్గొన్న పాచిపెంట, మక్కువ, సాలూరు, పార్వతీపురం రూరల్ టీమ్‌లకు వాలీబాల్ కిట్లతో పాటు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ రెడ్డి మాట్లాడుతూ గరిజన యువతకు ఆటలపోటీలపై ఆసక్తిని పెంపొందించేందుకు పోలీసుశాఖ తరఫున ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలో మత్తుపదార్థాలు ఎవరైనా సరఫరా చేసినట్లు సమాచారం తెలిసినట్లు అయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదుచేయబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై, నరసింహమూర్తి పోలీసులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కుటుంబ సభ్యుల అనుమానం



దేవిప్రియ (ఫైల్)

నెల్లిమర్ల రూరల్:

మండలంలోని నీలంరాజు పేటకు చెందిన వివాహిత దేవిప్రియ(21) విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందిన ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన దేవిప్రియ, నెల్లిమర్ల మండలంలోని నీలంరాజుపేటకు చెందిన లోకనాథం నాలుగు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి విజయనగరం పట్టణంలోని ఫూల్‌బాగ్‌లో అద్దెఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల దేవిప్రియ అనారోగ్యానికి గురికావడంతో భర్త తౌలుత నెల్లిమర్ల మిమ్స్‌కు తీసుకువెళ్లాడు. ఛాతీలో నొప్పి రావడంతో మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే దహన సంస్కారాల నిమిత్తం భర్త, బంధువులు దేవిప్రియ మృతదేహాన్ని స్వగ్రామమైన నీలంరాజుపేటకు శుక్రవారం తీసుకువచ్చారు. విషయం కాస్తా మృతురాలి తల్లిదండ్రులకు తెలియడంతో వారు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ బిడ్డ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు.

అయితే ఈ ఘటన విజయనగరం పరిధిలో జరగడంతో అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించగా వివాహిత కుటుంబ సభ్యులు విజయనగరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కాగా నీలంరాజుపేటలో వివాహిత మృతదేహాన్ని ఏఎస్సై సతీష్, సిబ్బంది పరిశీలించారు.

దొంగల వీరవిహారం..!

- గజపతినగరంలో 8 షాపుల్లో చోరీ
- షాపుల షట్టర్లు ధ్వంసం నగదు, వస్తు సామగ్రి అపహరణ



చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ భవ్య తదితరులు



వెంకి మొబైల్ అండ్ గిఫ్ట్ ఆర్టికల్స్ షాపులో సీసీ ఫుటేజ్‌లో కనిపిస్తున్న దుండగులు

గజపతినగరం: మండల కేంద్రంలో శుక్రవారం వేకువజామున మూడుగంటల ప్రాంతంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఈ నేపథ్యంలో 8షాపుల షట్టర్లను ధ్వంసం చేసి నగదు, వస్తుసామగ్రి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరంలో ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న 8షాపులను దొంగలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆ 8షాపుల్లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వెంకి మొబైల్ అండ్ గిఫ్ట్ ఆర్టికల్స్ షాపులో 27సెల్‌ఫోన్‌లు, రూ.లక్షా51వేల 420 నగదు చోరీకి పాల్పడినట్టు షాపు యజమాని తెలిపారు. దీంతో పాటు గజపతినగంలో డీ మార్ట్స్, ఆర్‌కే ఫ్యామిలీ మార్ట్, సూపర్ ఎం, ఉమెన్స్/కిడ్స్ జోన్, ఎస్ఎస్ ఫుట్ వేర్, వెంకటేశ్వర కిరాణా అండ్ జనరల్ స్టోర్స్, తిరుమల ట్రేడర్స్, ఎస్ఎస్ ఫుట్‌వేర్ మొత్తం 8షాపుల షట్టర్లను ధ్వంసం చేసి కౌంటర్‌లలో ఉన్న నగదు, వస్తువులను దొంగిలించారు. ఉమెన్/మెన్/కిడ్స్ జోన్ బట్టల షాపులో కౌంటర్‌లో ఉన్న నోట్లు రూ.10వేలు, చిల్లర రూ.5వేలు మొత్తం రూ.15వేలు పోయినట్లు యజమాని ఆగూరు ఆచారి తెలిపారు. అలాగే మిగతా షాపుల్లో కూడా కొంత నగదు, వస్తువులు పోయినట్లు బాధితులు తెలిపారు.

సంఘటనా స్థలానికి డీఎస్పీ, క్లూస్ టీమ్

గజపతినగరం టౌన్‌లోను, మెంటాడ జంక్షన్‌లో చోరీకి గురైన 8షాపులను డీఎస్పీ భవ్య క్షేత్ర స్థాయిలో పరిశీలించి దొంగతనం జరిగిన తీరును స్థానిక సీఐ జీఏవీ రమణ, ఎస్సై లక్ష్మణరావులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్లూస్‌టీమ్ ద్వారా వివరాలను, ఫింగర్ ప్రింట్‌లను తీయించి దర్యాప్తు చేశారు. సీసీఫుటేజీల ద్వారా దొంగలను గుర్తించి వారిజాడ కనిపెట్టి అదుపులోకి తీసుకునేలా దర్యాప్తు చేయాలని స్థానిక ఎస్సై లక్ష్మణరావును ఆదేశించారు. సీసీ ఫుటేజీల్లో ఇద్దరు వ్యక్తులు మాత్రమే కనిపిస్తున్నారు. 8షాపులను ఒకేరోజు షట్టర్లు పగులగొట్టి లోపలికి ఎలా ప్రవేశించారో అంతుపట్టని విధంగా సినీఫక్కీలో చోరీ జరిగినట్లు ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. డీఎస్పీ భవ్య వెంట క్లూస్ టీమ్ సిబ్బందితో పాటు స్థానిక సీఐ, ఎస్సైలు జీఏవీ రమణ, లక్ష్మణరావులు ఉన్నారు.

పోలీసుల వైఫల్యానికి నిదర్శనం: సీపీఎం

గజపతినగరం: ఎన్నడూ లేనివిధంగా ఒకేరోజు గజపతినగరంలో 8షాపుల్లో చోరీ జరగడం పోలీసుల వైఫల్యమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్, రాకోటి రాములు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం గజపతినగరం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా దొంగతనాలు జరగడం దుర్మార్గమన్నారు. గజపతినగరంలో గంజాయి, బెట్టింగులజోరు, మత్తులో తగాదాలు, కత్తులతో పొడుచుకునే సంఘటనలు, ఏసమయంలోనైనా మద్యం దొరకడం వంటివి పెరిగి పోవడంతో సమాజం పూర్తిగా ఛిన్నాభిన్నం అయిపోయిందన్నారు. దీనిని గాడిలో పెట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. 8షాపుల్లో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు వేగవంతంగా పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



విద్యార్థి మండ రాజా మృతదేహం

డెంకాడ: విజయనగరం జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఈ ప్రమాదాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలో గల డీజే దాబా ఎదురుగా విజయనగరం-నాతవలస ఆర్ అండ్‌బీ రహదారిపై జరిగిన ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం చెందాడు. పెదతాడివాడ వద్ద ఉన్న ఒక కల్యాణ మంటపంలో ఫంక్షన్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా, ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టడంతో విద్యార్థి మండ రాజా(17) అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి మండ గంగరాజు మండలంలోని పినతాడివాడలోని ఒక చర్చిలో పాస్టర్‌గా ఉంటూ కుటుంబంతో పాటు జీవనం సాగిస్తున్నారు. మృతుడి తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

కారు ఢీకొని మహిళ..



రమ మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని కామవరం జంక్షన్‌లో జాతీయరహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడకక్కడే మృతి చెందింది. పూసపాటిరేగ మండలకేంద్రంలోని కునుకువారి కళ్లాలకు చెందిన పతివాడ రమ (32) కామవరం జంక్షన్‌లో గుడికి వెళ్లే నిమిత్తం రహదారి దాటుతుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. మృతురాలికు భర్త తవిటి నాయుడుతో పాటు ఇద్దరు కుమారులు తరుణ్, మహేంద్రలు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. ఫిర్యాదు మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు 55 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు ఉంటుంది. మృతుడి జేబులో శ్రీకాకుళం నుంచి సికింద్రాబాద్‌కు జనరల్ టికెట్ కూడా ఉంది. అంతేకాకుండా మృతుడు ధరించిన తెలుపు రంగు చారల షర్టుపై ఆరాధన టైలర్స్, ఎస్.పేట అనే లేబుల్ ఉంది.

తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

- సాగులో ఉన్న భూమికి మ్యుటేషన్ చేయాలని వినతి
- పురుగుమందు డబ్బాతో రెవెన్యూ కార్యాలయం వద్ద హల్‌చల్



పురుగు మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం వద్ద తిరుగుతున్న రైతు అబద్ధం

నెల్లిమర్ల: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం గుషిణి గ్రామానికి చెందిన ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం వద్ద పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. దీనిని పోలీసులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుషిణి గ్రామానికి చెందిన చనమల్లు అబద్ధం అనే రైతు 20 ఏళ్ల కిందట అదే గ్రామానికి చెందిన కొంతమంది వద్ద ఒకటిన్నర ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అప్పట్లో ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. అప్పటినుంచి భూమిని తానే సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో తన భూమిని సర్వేచేసి మ్యుటేషన్ చేయాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. రైతు వద్ద భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు లేకపోవడంతో రెవెన్యూ అధికారులు ఏడాదిగా తిరస్కరిస్తూ వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న భూ విక్రయదారులు... అబద్ధం సాగుచేస్తున్న భూమిని వారిపేరున ఆన్‌లైన్ చేయించుకోవడం మొదలుపెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన రైతు శుక్రవారం ఉదయం పురుగు మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. సాగుబడిలో ఉన్న భూమికి మ్యుటేషన్ చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపునకు దిగాడు. మ్యుటేషన్ కోసం వీఆర్వో తనను లంచం అడిగారని ఆరోపించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆయనను వారించి పురుగుమందు డబ్బాను లాక్కున్నారు. అనంతరం న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ భూమి కొనుగోలుకు సంబంధించి రైతు వద్ద ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోవడం వల్ల మ్యుటేషన్ చేయలేకపోతున్నట్టు చెప్పారు. వీఆర్వో గోవింద్ మాట్లాడుతూ రైతు అబద్ధం సాగులో ఉన్న భూమిని ఆయన పేరిట మ్యుటేషన్ చేయాలని రెండు నెలలుగా తనపై ఒత్తిడి తెస్తున్నారని, పట్టా రైతులతో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సలహా ఇచ్చానని చెప్పారు. ఆ రైతు నుంచి ఎటువంటి లంచం డిమాండ్ చేయలేదని చెప్పారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు



పోలీస్‌స్టేషన్‌లో గంజాయితో పాటు నిందితులను చూపిస్తున్న పోలీసులు

విజయననగరం క్రైమ్:

విజయనగరం వన్‌టౌన్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను గురువారం అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాస్, వన్‌టౌన్‌సీఐ శ్రీనివాస్, ఎస్సై రేవతి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు. రాయగడ, విజయనగరానికి చెందిన ఇద్దరు యువకులు చెడు వ్యసనాలను అలవాటు పడి డబ్బుల కోసం గంజాయి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు విజయనగరం ఓల్డ్ రైల్వే క్వార్టర్స్ వద్ద ఇద్దరు నిందితులు గంజాయి ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రేవతి ఘటనా స్థలికి వెళ్లి నిందితులను పట్టుకుని విచారణ చేసి వారి దగ్గర ఉన్న రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అదుపులోకి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.